www.ghantaravam.com
epaper.ghantaravam.com

# ఘంటారావమ్
దినపత్రిక
అన్యాయంపై అక్షర సమరం

సంపుటి : 17
సంచిక : 91
పేజీలు : 4
ధర : రూ.3.00

కరీంనగర్
మంగళవారం 21 జూలై 2026

## విలేకరులు కావలెను

అన్యాయంపై అక్షర సమరం చేస్తూ.. సంచలన, పరిశోధనాత్మక కథనాలను ప్రచురించి ప్రజల విశ్వాసాన్ని తమ సొంతం చేసుకుంటున్న "ఘంటారావమ్ దినపత్రిక"లో పని చేయుటకు విలేకరులు, జిల్లా స్టాఫర్స్ కావలెను. ఉన్నది ఉన్నట్లు.. నిర్భయంగా, నిజాయితీగా, సామాజిక కోణంలో, సామాజిక స్పృహతో వార్త కథనాలు రాసే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.




- ములుగు జిల్లా
- మహబూబాబాద్ జిల్లా
- జనగామ జిల్లా
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా

ఘంటారావమ్ దినపత్రిక యాజమాన్యం
సంప్రదించాల్సిన నెంబర్ : 8978392904కు కాల్ చేయండి లేదా మీ వివరాలు వాట్సాప్ ద్వారా పంపండి



## రేపు వరంగల్‌కు డిప్యూటీ సీఎం భట్టి

- వివిధ విద్యుత్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్న మంత్రి

**నక్కలగుట్ట, ఘంటారావమ్ :**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క టీజీ ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ, వరంగల్‌లో చేపట్టే పలు విద్యుత్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు చేయనున్నట్లు సంస్థ యాజమాన్యం తెలిపిం ది. ఉదయం టీజీ ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం విద్యుత్ భవన్, నక్కలగుట్ట హనుమ కొండలో వాజ్‌పేయి కాలనీలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌లో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం,విద్యుత్ నగర్‌లో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం,వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ వద్ద 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, హనుమకొండ నూతన సర్కిల్ కార్యాలయ భవనం, టీజీఎన్‌పీ డీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం 5వ అంతస్తు నిర్మాణానికి శంఖుస్థాపన చేయనున్నట్లు యాజమా న్యం వెల్లడించింది.డబుల్ బెడ్‌రూమ్ కాలనీ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం,టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నూతన సమావేశ మందిరా న్ని ప్రారంభించినఅనంతరం టిజి ఎన్పీడీసీఎల్ ఉన్నత అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించినున్నట్లు తెలిపారు.మధ్యాహ్నం ములుగు రోడ్‌లో నూతనంగా నిర్మించిన వరంగల్ ఎస్ఈ కార్యాలయం, అదేవిధంగా ములుగు రోడ్‌లో నూత నంగా నిర్మించిన జిల్లా స్టోర్స్ భవనం,నార్తర్న్ పవర్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ భవనాన్ని ప్రారంభించిను న్నారు. అనంతరం వరంగల్ కలెక్టరేట్ కాంప్లెక్స్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం,ఖిలా వరంగల్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంఖుస్థాపనలు చేయనున్నారు.తదనంతరం కాకతీయ మెడికల్ కాలేజీ నుండి పోచమ్మ మైదాన్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మధ్య 33 కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్, వెంకట్రామ జంక్షన్ నుండి పోచమ్మ మైదాన్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మధ్య 33 కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్ పనులను ప్రారంభిస్తారని యాజమాన్యం వెల్లడించింది.

- ఎన్పీడీసీఎల్ పరిధిలో ఇప్పటికీ 109 ఏఈ, 114 సబ్ ఇంజనీర్, 2266 జూనియర్ లైన్‌మెన్ పోస్టులు ఖాళీ
- లైన్ మెన్ లేక ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం
- ఉద్యోగ ఖాళీల భర్తీలో అలసత్వం వహిస్తున్న ప్రభుత్వాలు
- పని ఒత్తిడిలో ప్రశాంతతకు దూరమవుతున్న ఉద్యోగులు
- మానసికంగా, శారీరకంగా అలసిపోతున్న విద్యుత్ సిబ్బంది
- ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న దయనీయ స్థితి
- విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పట్టించుకునేనా?
- రేపు ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయానికి రానున్న మంత్రి భట్టి
- తొలిసారి కార్పొరేట్ ఆఫీసును సందర్శించనున్న డిప్యూటీ సీఎం








# ఉన్నోళ్లతోనే పట్టు బట్టి!

## విద్యుత్ శాఖలో ఉద్యోగులపై పెరుగుతున్న పని భారం

**వరంగల్ ప్రతినిధి, ఘంటారావమ్ :**


నడిచే ఎద్దునే పొడుస్తారన్నట్టుగా ఉంది ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఉద్యోగుల పరిస్థితి. అవసరాలకు అనుగుణంగా సిబ్బంది, ఉద్యోగులు లేకపోవడంతో ఉన్న వారితోనే అన్ని పనులు చక్కదిద్దుతున్నారని తెలుస్తోంది. ఆఫీసులో పని విషయం పక్కన పెడితే క్షేత్రస్థాయిలో అవసరం మేరకు సిబ్బంది లేకపోతే ప్రజలు, విద్యుత్ వినియోగదారులు అసహనం వ్యక్తం చేయాల్సి వస్తోంది. సమయానికి సమస్యలు పరిష్కరించడంలో జరుగుతున్న జాప్యం వల్ల వినియోగదారులు ఉన్న సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్న సంఘటనలు ప్రతికూల పరిస్థితులకు దారి తీస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్పీడీసీఎల్ పరిధిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలో పాలకులు అలసత్వం కారణంగా అటు ఉన్న ఉద్యోగులు, ఇటు వినియోగదారులు అసంతృప్తికి గురవుతున్నారు.

### పట్టు' బట్టి' పని చేయిస్తే.. ప్రమాదాలకు దారి!

ఎన్పీడీసీఎల్ పరిధి ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి సేవలు అందిస్తోంది. తాజాగా, ఎన్పీడీసీఎల్ సీఎండీగా వరుణ్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొత్త సబ్ స్టేషన్లు, కొత్త లైన్లు, ఇండోర్ సబ్ స్టేషన్ల నిర్మాణం, కొన్ని చోట్ల పాత లైన్ల పునరుద్ధరణ, విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. అయితే, వాటి నిర్వహణ భారం మాత్రం ఉన్న ఉద్యోగులపైనే పడుతున్నట్లు ఉద్యోగులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం ఎన్పీడీసీఎల్ పరిధిలో వివిధ రకాల పోస్టులు 2489 ఖాళీ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో జూనియర్ లైన్ మెన్ 2266, సబ్ ఇంజనీర్ 114, ఏఈ 109 పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం ముందుకు రావడం లేదు. ఫలితంగా ఉన్న వారితోనే నయానో, భయానో పని చేయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఉద్యోగులు పని భారంతో మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నట్లు చర్చ

మిగతా 4వ పేజీలో..



భద్రకాళీ దేవాలయంలో ఏడవ రోజు

## నవరాత్రి ఉత్సవాలు

**వరంగల్ భద్రకాళి, ఘంటారావమ్ :**

వరంగల్ మహానగరంలో పరమపా వనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం గం॥ 04-00లకు నిత్యాహ్నికం పూర్తిచేసిన పిమ్మట అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి ఉగ్రా నిత్యా గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని శివదూతీమాత గాను అలంకరించి పూజారాధనలు నిర్వహించారు. ఏ తిథికి ఏ దేవత అధిదేవతో ఆ దేవతను ఆరాధించడం వల్ల ఆ రోజంతా శుభప్రదమౌతుందని

మిగతా 4వ పేజీలో..




వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు

# ప్రత్యేక కార్యాచరణ

### జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హనుమకొండ కలెక్టరేట్, ఘంటారావమ్ :**

రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థం గా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి పొంగులేటి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమా వేశం నిర్వహించారు.సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధి కారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు

మిగతా 4వ పేజీలో..

మహిళా సంఘాల ఏర్పాటుపై

## దృష్టి సారించాలి

- ఉమ్మడి వరంగల్ జిల్లా మెప్మా అధికారులతో సమావేశం
- ఎస్‌హెచ్‌జీ సంఘాల ఆదాయ వ్యయాల నిర్వహణకు ఉచితంగా పుస్తకాలు

**వరంగల్ కార్పొరేషన్, ఘంటారావంమ్ :**

మెప్మా అధికారులు నూతన మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఏర్పాటు పై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మెప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్ (ఏఎండి) యాదగిరి రావు అభిప్రాయపడ్డారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మెప్మా అధికారులతో వివిధ అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఏఎండి పాల్గొని సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న మహిళా సంఘాలు కాకుండా అదనంగా 30% సంఘాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఇందుకోసం మెప్మా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని,రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 2 లక్షల 2 వేల

మిగతా 4వ పేజీలో..



# నెక్కొండ ఎస్సై మహేందర్ సస్పెన్షన్

**మండలంలో హర్షాతిరేకాలు, సంబరాలు**

**నర్సంపేట/నెక్కొండ,ఘంటారావమ్:**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మహేందర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) శ్వేతా రెడ్డి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన గార్దుల వెంకన్న సివిల్ వివాదంలో ఎస్సై వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు రావడంతో,శాఖాపరమైన విచారణ చేపట్టి ప్రాథమికంగా ఆధారాలు గుర్తించిన అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. విధుల నిర్వహణలో ఎస్సై మహేందర్ నిష్పక్షపాత ధోరణి పాటించకుండా అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. అంతేకాకుండా, అమాయకులపై రౌడీషీట్లు నమోదు చేసి తీవ్రం గా మానసిక ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీశాయి. దఈ సస్పెన్షన్ వార్త తెలియగానే నెక్కొండ మండల కేంద్రంలో ప్రజలు పెద్ద–ఎత్తున సంబరాలు నిర్వహించారు. మండల ప్రజలు స్వీట్లు పంచుకొని, బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై అయినా చట్టం ముందు అందరూ సమానులనే రాజ్యాంగ స్ఫూర్తిని పాటిస్తూ, పోలీసులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, నెక్కొండలో ప్రతి పౌరుడికి న్యాయం జరిగేలా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

# విద్యార్థులపై లాఠీ-చార్జీ అమానుషం

**పోలీసు చర్యలను ఖండించిన మోడెం ఎల్లాగౌడ్**

**ఖానాపురం, ఘంటారావమ్:**

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా పార్లమెంట్ మార్చ్ చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్ మండిపడ్డారు. ఖానాపురం ప్రాంతంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ని తీవ్రంగా ఖండించారు. దేశంలో వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడకపోవడం దారుణమని, బాధ్యుడైన



కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను కేబినెట్ నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎలాంటి హింసాత్మక ధోరణికి పాల్పడకుండా, కేవలం సత్యాగ్రహ మార్గంలో శాంతియుతంగా పార్లమెంట్ మార్చ్ చేస్తుంటే వారిపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడం దేశ రాజకీయాల్లో ఒక చీకటి రోజు అని అభివర్ణించారు. 56 అంగుళాల ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యానికి, విద్యార్థుల హక్కులకు విలువ లేకుండా పోయిందని విమర్శించారు. పేపర్ లీకేజీల బాధితులకు అండగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి యువజన కాంగ్రెస్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులపై లాఠీచార్జ్‌కి పాల్పడిన పోలీసు అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలోని నిరుద్యోగ యువత, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ, విద్యార్థుల పక్షాన యువజన కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం పోరాటాలు కొనసాగిస్తాయని ఎల్లాగౌడ్ హెచ్చరించారు.



# క్షయ వ్యాధి నిర్మూలనపై సమావేశం

**నర్సంపేట, ఘంటారావమ్:**

నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ బ్లెస్సీ ఈస్టర్,వరంగల్ జిల్లా ఎన్టీఈపీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అరుణ్‌జోషి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'టీబీ ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా మెడికల్ విద్యార్థులను 'నిక్షయ్ మిత్ర'లుగా నియమించాలని నిర్ణయించారు. నిక్షయ్ మిత్ర మొబైల్ యాప్ ద్వారా ప్రతి పది మంది టీబీ రోగులకు ఒక నిక్షయ్ మిత్ర చొప్పున బాధ్యత వహించి, వారికి తగిన అవగాహన కల్పించాలని తీర్మానించారు. అలాగే, కళాశాలలో ఒక మొబైల్ ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. త్వరగా వ్యాధిని గుర్తించండి – త్వరగా చికిత్స పొందండి అనే నినాదంతో ఈ సమావేశాన్ని విజయవంతంగా ముగించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ దామోదరీబాయి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ పూనమ్ కుమార్ జా, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సుజాత,డాక్టర్ ఉషారాణి, డాక్టర్ ఉమర్ పాషా, ఎన్.పద్మజ, టి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# కేటీఆర్ నిరుద్యోగ భరోసా యువతకు అండ

**బిఆర్ఎస్వి జిల్లా నాయకులు పోచంపల్లి రఘుపతి**

**హనుమకొండ(నడికూడ), ఘంటారావమ్:**

కేటీఆర్ నిరుద్యోగ భరోసా ఉచిత ఆన్లైన్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని నడికూడ మండలం వరికోల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్వి జిల్లా నాయకుడు పోచంపల్లి రఘుపతి తెలిపారు. గ్రూప్స్, పోలీసు లాంటి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే మీ లక్ష్యమా? అయితే ఆలస్యం ఎందుకు.. మాజీ మంత్రి ,యువతకు ఆదర్శప్రాయుడు, కేటీఆర్ 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 'నిరుద్యోగ భరోసా' ద్వారా అందిస్తున్న సువర్ణ అవకాశం, ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను వినియోగించుకోవాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, మాజీ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో విన్నర్ ఆన్లైన్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ సహకారంతో వరంగల్ ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువతకు గ్రూప్స్–2, గ్రూప్స్–3,ఎస్ఐ,కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షలకు విన్నర్స్ ఆన్‌లైన్ ఇనిస్టిట్యూట్ విన్నర్స్ ఆన్లైన్ ఇన్స్టిట్యూట్ సహకారంతో ఉచిత కోచింగ్ అందించే యాప్‌ను జులై 22న హనుమకొండలోని న్యూ రాయల్ గార్డెన్స్ నందు ఆవిష్కరణ ఉండనుందని ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇందుకోసం 'విన్నర్స్ ఆన్లైన్' మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని,మీ గ్రామం, మండలం,జిల్లా వివరాలను వాట్సాప్ 89850 96699 ఫోన్ నెంబర్‌కి పంపాలని కోరారు. దరఖాస్తుదారులకు అప్లికేషన్ ఫామ్ పంపడం జరుగుతుందని, దానిని పూర్తిచేసి నిర్వహించే పోటీ పరీక్షలు అవగాహన సదస్సుకు అప్లికేషన్ ఫామ్ తో పాటు హాజరు అయిన వారందరికీ సంవత్సరం పాటు ఉచిత ఆన్లైన్ కోచింగ్ అందించనున్నమని, ఉత్సాహవంతులు నేరుగా హాజరు కావాలని కోరారు.



# ఢిల్లీ బాటపట్టిన రాష్ట్ర నాయకులు

- దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వమే!
- పరకాల సేవాదళ్ అధ్యక్షులు ఎరుకొండ రవీందర్‌గౌడ్

**ఆత్మకూర్, ఘంటారావమ్ :**

అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సమావేశానికి హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం రైలుమార్గం ద్వారా ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు పార్టీ జెండాలు, బ్యానర్లతో ఉత్సాహంగా పాల్గొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి,హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఇనగాల వెంకటరామిరెడ్డి ఆదేశానుసారం పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు ఏరుకొండ రవీందర్ గౌడ్,జిల్లా అధ్యక్షులు బొచ్చు చందర్,నడికూడ మండల అధ్యక్షులు కుమారస్వామి తదితరులు ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ సమావేశంలో పార్టీ బలోపేతం, సేవాదళ్ సంస్థాగత నిర్మాణం, రానున్న రాజకీయ పరిణామాలు,ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని,రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వారు విశ్వాసం వ్యక్తం




చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలతో కేంద్ర ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని,కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పాలన అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సేవాదళ్ కార్యకర్తలు పార్టీకి వెన్నెముకలుగా నిలవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఢిల్లీ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు పార్టీ భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేస్తాయని, తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో సేవాదళ్ ప్రతినిధులు పాల్గొనడం విశేషమని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్‌లో నాయకులకు పార్టీ కార్యకర్తలు ఘనంగా వీడ్కోలు పలికారు.



# మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

**హసన్‌పర్తి, ఘంటారావమ్:**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదినం వేడుకలు 66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఖర్గే జన్మదిన వేడుకలకు హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దిలీప్ రాజ్‌తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ శాసన సభ్యులు కేఆర్ నాగరాజు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గొడుగుల పంపిణీ కార్యక్రమంలో కోరే చంద్రమౌళి (గొడుగుల దాత), రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు సోమ వేణుగోపాల్, తో కలిసి ఏంఎల్ఏ కేఆర్ నాగరాజు చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ చేశారు,

ఈ కార్యక్రమంలో హన్మకొండ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు పింగిలి రామ్ నర్సిహ రెడ్డి, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, వంగపహడ్ చైర్మెన్ మెరుగు రాజేష్ గౌడ్, 65 డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్, నాయకులు, తోకల లక్ష్మారెడ్డి, కనపర్తి కిరణ్, వీసం సురేందర్ రెడ్డి, మదన్ గౌడ్, మండల మీడియా ఇన్చార్జి బిగుల్లా సురే ష్, పెద్దమ్మ నరసింహారావు, ఎల్ఐసి వెంకన్న, ఆరేల్లి వెంకటస్వామి, జె.రవీందర్, గరిగే రాజు, ఆనంద్, పుల్ల రవీందర్, తాళ్ల మధు, తదితరులు పాల్గొన్నారు.




# జిల్లపెల్లి సుధాకర్‌కు చల్లా పరామర్శ

**ఆత్మకూరు, ఘంటారావమ్ :**

హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండలం పెంచికలపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జిల్లపెల్లి సుధాకర్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడగా ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంగళవారం పరామర్శించారు. సుధాకర్ ఆరోగ్య పరిస్థితిని, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై వివరాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకులు గోవిందు రామస్వామిని కూడా చల్లా ధర్మారెడ్డి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అవసరమైన వైద్య చికిత్స తీసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు కాంతాల కేశవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, రాజేశ్వరరావు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# థార్ జీపు ఢీకొని రైతు మృతి

**శంకరపట్నం, ఘంటారావమ్:**



తార్ జీప్ ఢీకొని ఓ రైతు మృతి చెందిన ఘటన మంగళవారం కరీంనగర్ జిల్లా , శంకరపట్నం మండలం, కొత్త గట్టు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తగట్టు గ్రామానికి చెందిన తూముల లక్ష్మణ్ రావు పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా జాతీయ రహదారిపై గ్రామ పంచాయతీ ఎదుట హుజురాబాద్ వైపు నుండి కరీంనగర్ వైపు వెళుతున్న తార్ జీబ్ డీ కొనడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా లక్ష్మణరావు పరిస్థితి విషమించి మృతి చెందినట్లు గ్రామస్తులు, 108 సిబ్బంది గూడూరి సతీష్ రెడ్డి, పైలెట్ ఎం గోపికృష్ణ తెలిపారు.



# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**శంకరపట్నం, ఘంటారావమ్ :**


రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులకు గాయాలైన ఘటన కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, తాడికల్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, 108 సిబ్బంది ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి, ఎం గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం వన్నారం గ్రామానికి చెందిన రాజేశ్వర్ అతని అన్న మద్దెల రాజేష్ ద్విచక్ర వాహనంపై మొలంగూర్ గ్రామంలోని కావేరి సీడ్ కంపెనీలో డ్యూటీకి వెళ్తుండగా మార్గంమధ్యలో తాడికల్ శివారులో కుక్క అడ్డువచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా రాజేశ్వర్, రాజేష్ కిందపడ్డారు. గాయాలు కావడంతో 108 వాహనంలో ప్రథమ చికిత్స అందించి, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# 'సర్'ను సద్వినియోగం చేసుకోవాలి

- గడువులోగా దరఖాస్తు ఫారాలు అందించాలి
- సర్ ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి
- ప్రజలకు తహసీల్దార్ ముద్దసాని రమేశ్ సూచన

**వీణవంక, ఘంటారావమ్:**

ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని ప్రతి ఒక్క ఓటరు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసిల్దార్ ముద్దసాని రమేష్ పేర్కొన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వారు మాట్లాడారు. సర్ ప్రక్రియ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించినందున ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవా లని కోరారు. మండలంలో ప్రస్తుతానికి 70 శాతం సర్ ప్రక్రియ పూర్తయిందని గుర్తు చేశారు. గ్రామాలలో బిఎల్ఓ లకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. సర్ ప్రక్రియలో యువతీ యువకులు ,విద్యా వంతులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి ఒక్కరిని సర్ ప్రక్రియలో భాగస్వాములయ్యేలా తోడ్పాటు అందించాలని కోరారు. ఎన్యుమరేషన్ ఫామ్స్ తీసుకున్న వ్యక్తులు పూర్తి చేసి సకాలంలో ఎన్యుమరేటర్స్‌కి అందించాలని కోరారు. లేనియెడల తమ ఓటు హక్కును కోల్పోవడమే కాకుండా ప్రభుత్వపరమైన సంక్షేమ పథకాలకు అనర్హులుగా పరిగణించబడతారని తెలిపారు. ఉద్యోగరీత్యా మరియు బతుకుతెరువు నిమిత్తం ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్న వ్యక్తులు సర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. సర్ ప్రక్రియలో బిఎల్ఓలు నిర్లక్ష్యాన్ని వహించినట్లయితే శాఖ పరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన గడువులోగా దరఖాస్తు ఫారాన్నీ



పూర్తి చేసి వంద శాతం సర్ ప్రక్రియను చేపడతామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# జయముఖి ఇంజినీరింగ్ కాలేజీ తీరుపై నిరసన

## సత్వర చర్యలకు డిమాండ్

**నర్సంపేట, ఘంటారావమ్:**
నర్సంపేటలోని జయముఖి ఇంజినీరింగ్ కాలేజీలో రెండు నెలలుగా సెమిస్టర్, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. భారీగా ఫీజులు వసూలు చేసి, యాజమాన్య అంతర్గత సమస్యల కారణంగా పరీక్షలు నిర్వహించకుండా ప్రిన్సిపాల్ అజ్ఞాతంలోకి వెళ్లడంపై విద్యార్థి, బీసీ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కాలేజీ ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులను బీసీ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు దిడ్డి పార్థసారథి, గుర్రం అజయ్ పరామర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ, జిల్లా కలెక్టర్ స్పందించి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు వెంటనే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 23న నర్సంపేట అమరవీరుల స్థూపం వద్ద విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు రాష్ట్ర నాయకులు గుర్రం అజయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు దిడ్డి పార్థసారథి, బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, బీసీ నాయకులు గట్ల నర్సింహరాములు బీసీ సంఘం నాయకులు విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.







# నెట్ లేకున్నా ఫోన్ పే కొట్టొచ్చు!

**ఘంటారావమ్ డెస్క్:**
దేశంలో డిజిటల్ పేమెంట్స్ సిస్టమ్‌లో మరో విప్లవాత్మక మార్పు రాబోతున్నది. ఇంటర్నెట్ కనెక్షన్ లేని ప్రాంతాల్లోనూ సులభంగా యూపీఐ చెల్లింపులు జరిపేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఒక కొత్త ఫీచర్‌ను అభివృద్ధి చేస్తున్నది. దీని ద్వారా యూజర్ ఫోన్, వ్యాపారి వద్ద ఉండే 'పాయింట్ ఆఫ్ సేల్' టెర్మినల్ రెండూ ఆఫ్‌లైన్‌లో ఉన్నప్పటికీ.. రూ.2,000 వరకు చెల్లింపులు చేయవచ్చు. ఈ సదుపాయాన్ని నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఆధారంగా 'ట్యాప్–టు–పే' విధానంలో తీసుకురానున్నారు. ఈ కొత్త ఫీచర్ పనితీరుపై అందుతున్న సమాచారం ప్రకారం వినియోగదారులు ముందుగా తమ ఫోన్‌లో ఇంటర్నెట్ ఉన్నప్పుడు 'ఆన్–డివైస్ యూపీఐ లైట్ వ్యాలెట్' లోకి నగదును లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇంటర్నెట్ సిగ్నల్ లేని ప్రదేశాల్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు, తమ ఎన్ఎఫ్‌సీ ఆధారిత స్మార్ట్‌ఫోన్‌ను వ్యాపారి వద్ద ఉన్న సర్టిఫైడ్ ఆఫ్‌లైన్ పీఓఎస్ టెర్మినల్‌పై ట్యాప్ చేస్తే చాలు. ఎలాంటి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే లావాదేవీ పూర్తవుతుంది. ఈ లావాదేవీ వివరాలను పీఓఎస్ టెర్మినల్ తనలో స్టోర్ చేసుకొని, తిరిగి ఇంటర్నెట్ కనెక్టివిటీ వచ్చిన వెంటనే సెటిల్‌మెంట్ కోసం పంపుతుంది. ముఖ్యంగా విమానాలు, భూగర్భ మెట్రో స్టేషన్లు, మారుమూల గ్రామాలు వంటి నెట్‌వర్క్ సరిగాలేని లేదా అసలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఈ ఫీచర్‌ను రూపొందిస్తున్నారు. దీనివల్ల ప్రయాణ సమయాల్లో, సిగ్నల్ సమస్యలు ఎదురయ్యే చోట్ల డిజిటల్ చెల్లింపుల విశ్వసనీయత, సౌలభ్యం గణనీయంగా పెరుగుతుంది. ఈ ఏడాది చివరి నాటికి ప్రముఖ తయారీదారుల నుంచి పీఓఎస్ టెర్మినల్స్‌కు ధ్రువీకరణ పత్రాలు జారీచేసే ప్రక్రియను ఎన్‌పీసీఐ ప్రారంభించవచ్చని తెలుస్తున్నది.



# చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

**ఘంటారావమ్ డెస్క్:**
అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని ఆర్జాలబావి–2 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందుతున్న మెనును పరిశీలించారు. బాలింతలు, గర్భినీలతో మాట్లాడి పౌష్టికాహారం అందజేతపై వివరాలు ఆడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో ఫ్రీ స్కూల్ చేయించి వారితో కొద్దిసేపు మాటామంతి నిర్వహించారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేసి వారి పెరుగుదలలో లోపాలు ఉన్నా వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనతను తగ్గించేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. చాలామంది మహిళలు రక్త హీనతతో బాదపడుతున్నారని, దీనివల్ల చిన్నారులు బలహీనంగా అనారోగ్యంతో జన్మించి చనిపోతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నందున సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. మహిళల్లో రక్తహీనత కారణంగా చిన్నారులు పౌష్టికాహారం లోపాన్ని అదిగమించేందుకు గర్భినీలు, బాలింతలు ఏ సమయంలో ఏలాంటి ఆహారం తీసుకోవాలి, ఏరకమైన భోజనం తీసుకోవాలనే అంశాలపై వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. పోషకాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకుంటే శిశువులు ఆరోగ్యంగా జన్మిస్తారని తెలిపారు. చాలా మంది పౌష్టికాహారం లోపంతో అనారోగ్యం బారిన పడుతున్నందున అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

## అంగన్‌వాడీ సెంటర్ మూసివేతపై ఎంపీడీవో ఆగ్రహం





**ఖానాపురం, ఘంటారావమ్:**
ఖానాపూర్ మండల పరిధిలోని ధర్మారావుపేట, బాలు తండా గ్రామపంచాయతీలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల హట్ డ్వెల్లర్స్ సర్వేను మండల పరిషత్ అభివృద్ధి అధికారి అద్వైత మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి సర్వే తీరును పర్యవేక్షించిన ఆమె, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నిబంధనల ప్రకారం సర్వే పూర్తి చేయాలని ధృవీకరణ అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన పేదలెవరూ మిగిలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.


**పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు**
అనంతరం బాలు తండా ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో అంగన్‌వాడీ కేంద్రం మూసివేయబడి ఉండటాన్ని, చిన్నారులు ఎవరూ లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారుల నుండి వివరణ కోరారు. చిన్నారులకు ప్రభుత్వ సేవలన్నీ నిరంతరం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అదేవిధంగా బలూతండ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన మరుగుదొడ్ల నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించే దిశగా ఆయా పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'సర్' కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలి



**వీణవంక, ఘంటారావమ్:**
ఎన్నికల సంఘం చేపట్టిన " సర్" కార్యక్రమంను 100 శాతం పూర్తి చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొనీ మాట్లాడారు. అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో సర్ అత్యంత కీలకమన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటం మనందరి బాధ్యత అన్నారు .ఒక్క అర్హుడైనా మిగిలిపోకుండా ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించాలనీ సూచించారు. ప్రతి బిఎల్ఓ,ప్రతి కోఆర్డినేటర్ తమకు అప్పగించిన బాధ్యతను సేవాభావంతో నిర్వర్తించాలనీ గుర్తు చేశారు. మండలంలోని సర్ కార్యక్రమాన్ని 100% శాతం పూర్తి చేసి హుజురాబాద్ నియోజకవర్గంలో మొదటి స్థానంలో నిలబెట్టడానికి మనమందరం సంకల్పంతో పనిచేయాలనీ పేర్కొన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాన్ని నిర్దేశిత గడువులో పూర్తి చేయాలనీ కోరారు .కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేస్తే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందనీ పిలుపునిచ్చారు. ప్రజాస్వా మ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గెల్లు శ్రీనివాస్, చంద్ర మొగిలి ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి,ఎల్లారెడ్డి, నల్ల కొండాల్ రెడ్డి ,పంజాల సతీష్ గౌడ్సాహెబ్ హుస్సేన్, చేపూరి రాజు, పానుగంటి మధుకర్, పల్లెర్ల కిరణ్, కాం గ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి రాజగోపుర నిర్మాణానికి భూసార పరీక్షలు



**వరంగల్ భద్రకాళి, ఘంటారావమ్ :**
చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో మహా పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న భద్రకాళీ దేవస్థానానికి నాలుగు వైపులా మాడవీధుల నిర్మాణం జరిపే క్రమంలో అమ్మవారి ఆలయానికి పూర్వ పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిశలలో నాలుగు రాజగోపురాలు నిర్మాణం చేయడానికి ధర్మకర్తల మండలి నిర్ణయం మేరకు ప్రభుత్వం అంగీకరించి సదరు నిర్మాణమునకు గత సంవత్సరం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా నురేఖ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాననసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన కూడా జరిగింది. ఈ సందర్భంగా ఆలయానికి పశ్చిమం వైపున మరియు తూర్పు వైపున దేశంలోనే అత్యంత ఎత్తయిన (9 అంతస్తుల) రాజగోపురం, తూర్పు దిశలో ఏడు అంతస్తుల రాజగోపురాన్ని కాకతీయ శైలిలో నిర్మాణం చేయడానికి ప్లాన్లు , ఎస్టిమేట్లు చేయబడ్డాయి. ఈ నిర్మాణానికి నిర్దేశించిన భూమి యొక్క ధృడత్వాన్ని పరిశీలించడానికి సాయిల్ టెస్ట్ చేయడానికి అంజీ జియో సొల్యూషన్స్, హైదరాబాదువారికి ఇట్టి బాధ్యతలు అప్పగిం చుట జరిగినది. వారు ఈ రోజు ఆలయ ప్రాంగణంలో కార్యాచరణ ప్రారంభించారు. ప్రతి 1.5 మీటరు లోతులో మట్టిని సేకరించి సాయిల్ టెస్ట్ జరుపుతారు. నదరు రిపోర్టు ప్రకారం రాజగోపురానికి వేయవలసిన పునాది ప్రమాణాలను నిర్ణయిస్తారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ ఇంజనీరిగింగ్ సెల్ కు చెందిన ఎడ్ల శివశంకర్ నహాయ స్తపతి, ఆలయ పర్యవేక్షకులు కూచన హరినాథ్, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని అంజీ జియో సొల్యూషన్స్, హైదరాబాదుకు చెందిన సాంకేతిక నిపుణులు తెలిపారు.



# తెలంగాణలో భారీ వర్షాలు

**ఘంటారావమ్ డెస్క్:**
ఉపరితల ద్రోణి ప్రభావంతో ఉత్తర తెలంగాణ జిల్లాలోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే హైదరాబాద్ నగరంలో తేలికపాటి వర్షం కురియనుంది. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం కురిసే సమయాల్లో చెట్ల కింద ఉండొద్దని సూచించారు.

# అడ్వెంచర్ అవార్డులకు ఆహ్వానం

**ఘంటారావమ్ డెస్క్:**
టెన్సింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి కొత్త ప్రశాంత్ మంగళవారం తెలిపారు. అర్హతల గలవారు జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు కామన్ అవార్డ్స్ పోర్టల్ https://awards.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాహస రంగంలో అసమాన ప్రతిభ చూపిన వ్యక్తుల విజయాలను గుర్తించడానికి యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 'టెన్సింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు'ను ప్రారంభించిందని ప్రశాంత్ వెల్లడించారు. ఆఫ్‌లైన్ మోడ్ ద్వారా మంత్రిత్వ శాఖలో సమర్పించిన దరఖాస్తులను తిరస్కరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు/ కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలన విభాగాల యువజన / క్రీడా శాఖ లేదా ఇండియన్ మౌంటనీరింగ్ ఫౌండేషన్ వంటి గుర్తింపు పొందిన అడ్వెంచర్ ఇన్‌స్టిట్యూట్ లేదా ఆర్మీ/ నేవీ/ వైమానిక దళం లేదా ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసు లేదా ఇలాంటి ఇతర పారా మిలిటరీ దళాలు అవార్డు కోసం సిఫారసు చేయవచ్చన్నారు. సంబంధిత విభాగాలు/ సంస్థలు దరఖాస్తుదారునికి తమ సిఫారసును ఈ–మెయిల్ ద్వారా లేదా మరేదైనా తగిన పద్ధతి ద్వారా అందించవచ్చని తద్వారా వారు అవార్డుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆర్మీ/నేవీ/వైమానిక దళంలోని సేవలందించే సిబ్బందికి సంబంధించిన అన్ని నామినేషన్లను వారి సంబంధిత అడ్వెంచర్ సెల్/డైరెక్టరేట్ సిఫారసు చేయాల్సి ఉంటుందని, ఈ అవకాశాన్ని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 3 సంవత్సరాల నుంచి చేసిన సాహస కృత్యాల గురించి వివరిస్తూ 3 పాస్‌పార్ట్ సైజ్ ఫొటోలు జత చేసి ఆగస్టు 20లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

**ఘంటారావమ్ డెస్క్:**
రాష్ట్రంలో నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కాపాడటమే లక్ష్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నేతలు, కుల, ప్రజా సంఘాలు, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, మేధావులు ఈ సమావేశానికి పెద్ద ఎత్తున హాజరై పెండింగ్ బకాయిలపై ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. సమాజాన్ని భ్రష్టు పట్టించాలనే కుట్రతోనే విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని స్వయంగా నాశనం చేస్తున్నారు. పెండింగ్ బకాయిలు విడుదల చేసే వరకు విద్యార్థులకు, యాజమాన్యాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. శాసనమండలిలో ప్రభుత్వంపై పోరాటం చేస్తాం. అని అన్నారు.

### వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు

# ప్రత్యేక కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి

చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు.ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



**ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేయాలి : మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు.వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్థక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశు గ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు.వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టండి

- మాన్ సూన్ బృందాల సహకారంతో పని చేయండి
- ప్రధాన రహదారులు పరిశుభ్రత అత్యవసరం



**వరంగల్ కార్పొరేషన్, ఘంటారావమ్ :**

విస్తృతం గావర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు.నగర పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన తిరుమల బార్ జంక్షన్, ఎన్‌జీఓస్ రోడ్డు, ఎస్‌బిహెచ్ కాలనీ,రామకృష్ణ కాలనీ,కాకతీయ కాలనీ, బొంది వాగు, శివ నగర్, మైసయ్య నగర్, సాయి గణేష్ నగర్ వడ్డేపల్లి చెరువు, 12 మోరీలు ప్రాంతాల్లో కమిష నర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా ఇంజనీరింగ్‌కు చెందిన మాన్ సూన్ టీమ్స్ సహకారంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే తొలగించాలని చిన్న చిన్న గల్లీలోని డ్రైన్‌లో నీరు నిలిచి ఉండకుండా అవసరం మేరకు డీ సిల్టింగ్ ప్రక్రియ చేపట్టి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రధాన రోడ్లపై శానిటేషన్ పక్కాగా జరిగేలా చూడాలని డివైడర్‌ల మధ్యలో చెత్త, మొక్కల ఆకులు పేరుకు పోకుండా తొలగించాలని వీటి తో పాటు లింక్ రోడ్‌ల శుభ్రతపై దృష్టి సారించాలని స్వీపింగ్ మిషన్ లు మరమ్మత్తులకు గురి కాకుండా చూడడం తో పాటు అట్టి మిషన్ పని తీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కమిషనర్ అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో కమిషనర్ వెంట ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజారెడ్డి, ఏంహెచ్‌ఓ డా.రాజేష్, శానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను తదితరులు ఉన్నారు.



## గడదాసు మణికంఠకు ఘన సత్కారం

**వరంగల్, ఘంటారావమ్ :**

జపాన్‌లో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో ప్రతిభ కనబరిచి ఒక గోల్డ్ మెడల్, ఒక సిల్వర్ మెడల్ సాధించిన ఓరుగల్లు యువ ప్రతిభ గడదాసు మణికంఠకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అకాడమీకి బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అభినందనలు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా మార్షల్ ఆర్ట్స్‌లోని పది రకాల విద్యలను అభ్యసిస్తూ, వందలాది మంది చిన్నారులకు ఆత్మరక్షణ కళలో శిక్షణ అందిస్తూ మణికంఠ విశేష సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 23 రాష్ట్రాలలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని సుమారు 350కి పైగా పురస్కారాలు అందుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి అధికారిక "పోక్సో యాక్ట్ సెల్ఫ్ రియలిస్టిక్ డిఫెన్స్ ట్రైనర్"గా అర్హత సాధించడం ఓరుగల్లు ప్రజలకు గర్వకారణంగా నిలిచిందన్నారు. దేశ గౌరవాన్ని, తెలంగాణ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన మణికంఠను వారి తల్లిదండ్రులను సత్కరించి, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, అన్ని విధాలా అండగా ఉంటామని ఎర్రబెల్లి ప్రదీప్ రావు హామీ ఇచ్చారు.

### భద్రకాళీ దేవాలయంలో ఏడవ రోజు

## నవరాత్రి ఉత్సవాలు

మొదటి పేజీ తరువాయి

జ్యోతిశ్శాస్త్రం చెప్పడం వల్ల ఈ రోజు మంగళవారం కావడం వల్ల భక్తులందరికీ ఈ రోజు శుభప్రదం కావాలని ఆలయంలో అర్చకులు ముందుగా సుబ్రహ్మణ్య ఆరాధన జరిపారు.

దశమహావిద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి ఏడవ రోజుకు అధిదేవత ఉగ్రామాత, ఈమెను ఉగ్రతారా అని కూడా అంటారు. ఈమెయే శ్రీరాముని చైతన్య శక్తిగా తంత్రాలు చెబుతున్నాయి. ఈమెను ఉపాసించిన వారికి సామ్రాజ్యైశ్వర్యము, శత్రువిజయము, కలుగుతాయి. అట్లాగే షోడశీ క్రమాన్ని అనుసరించి ఏడవ రోజుకు అధిదేవత శివదూతి అమ్మవారు. అమ్మవారి జ్ఞానశక్తిని శివదూతిమాతగా అలంకరించి ఆరాధించారు. అమ్మవారు రాక్షసులను పాతాళానికి వెళ్ళిపోయి జీవించమని తనమాటగా చెప్పమని శంకరుని శుంభాసురుని దగ్గరికి దూతగా పంపుతుంది. అప్పటి నుండి అమ్మవారిని శివదూతిగా శాస్త్రాలు కీర్తించాయి. శివదూతి అమ్మవారిని సేవించడం వల్ల అపరిష్కృతంగా ఉన్న వ్యవహారాలన్నీ చక్కబడతాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేష తెలిపారు.

## మహిళా సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించాలి

మొదటి పేజీ తరువాయి

ఎస్‌హెచ్‌జీ గ్రూపులు మాత్రమే ఉన్నాయని రాష్ట్ర జనాభాతో పోలిస్తే ఈ గ్రూపుల సంఖ్య అత్యల్పమని, ఎస్‌హెచ్‌జీ సంఘాల ఆదాయ వ్యయాల నిర్వహణకు 33 రకాల పుస్తకాలను అవసరం అని రాష్ట్ర అవతరణ కు ముందు 2011లో ఇట్టి పుస్తకాలను అందజేయడం జరిగిందని,ఇట్టి అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టి కి తీసుకువెళ్ళిన నేపథ్యం లో ఎస్ హెచ్ జీ సంఘాలకు ఉచితం గా అందజేయడానికి రూ.30 కోట్లను కేటాయించి వాటిని ఎస్ హెచ్ జీ గ్రూపు లకు ఉచితం గా అందించాలని ఆదేశించారని అట్టి పుస్తకాలను త్వరలోనే అందజేస్తామని, పట్టణ ప్రాంతాల్లోని స్లం ప్రాంతాల్లో నివసిస్తున్న పేద పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో విద్య ను అందించడానికి రాష్ట్ర వ్యాప్తం గా టౌన్ లెవెల్ టాస్క్ ఫోర్స్ (టి ఎల్ టి) బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని,ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాను ఎంపిక చేయడం జరిగిందని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్)లో భాగంగా జిల్లా కలెక్టర్‌లు చైర్మెన్‌లుగా సంబంధిత నగరాల కమిషనర్‌లు వైస్ చైర్మెన్‌లుగా మెప్మా అధికారులు, సిబ్బందితో కమిటీలు వేయడం జరుగుతుందని అట్టడుగు స్థాయిలో ఉండే పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఏఏండి తెలిపారు. ఈ సమావేశం లో అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వరావు మెప్మా పిడి రాజేశ్వర్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య డిఎంసిలు రజిత రాణి, రేణుక, విజయ, రాజేశ్వరి ఇంచార్జి డిఎంసి హర్షవర్ధన్ ఏడిఎంసిలు వహీద, సతీష్ టిఏంసిలు రమేష్ వెంకట్ రెడ్డి సిఓలు సకినాల రమేష్ ప్రవీణ్ శ్రీలత రమాదేవి రజిత తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నోళ్లతోనే పట్టుబట్టి!

మొదటి పేజీ తరువాయి

జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తీవ్ర మానసిక సంఘర్షణకు లోనై ప్రమాదాలకు గురై ఉద్యోగులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోవలసి వస్తున్నదని పలువురు భావోద్వేగానికి గురవుతున్నారు.

**భట్టి గారు.. పట్టించుకుంటారా?**

పని భారంతో తల్లడిల్లుతున్న ఉద్యోగులు, సిబ్బంది తమ ఆవేదనను దృష్టిలో ఉంచుకొని సంస్థ సీఎండీ ఖాళీల వివరాలను ప్రభుత్వానికి పంపించినట్లు విశ్వసనీయ సమాచారం.ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ భవన్ కు వస్తున్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న పోస్టులపై సరైన రీతిలో స్పందిస్తారని కంపెనీ యాజమాన్యం ఆశిస్తోంది.

**తొలిసారి కార్పొరేట్ ఆఫీసుకు భట్టి..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం హోదాలో మల్లు భట్టి విక్రమార్క పలుమార్లు వరంగల్ నగరానికి విచ్చేశారు. కానీ, విద్యుత్ శాఖ మంత్రి హటరీదాలో తొలిసారి ఆయన బుధవారం ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనున్నారు. ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో సాగుతున్న పలు అభివృద్ధి పనులు, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంపై సంస్థ కార్యాచరణ, వర్షాకాలంలో విద్యుత్ సరఫరా, ఇతరత్రా అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉచిత విద్యుత్ సరఫరా, రైతుల విద్యుత్ కనెక్షన్లపై కూడా చర్చించనున్నట్లు సమాచారం. కాగా, తొలిసారి విద్యుత్ భవన్ కు మంత్రి విచ్చేస్తున్న నేపథ్యంలో మంత్రికి ఘనంగా స్వాగతం పలికేందుకు సంస్థ యాజమాన్యం, ద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు అన్ని సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

## విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**నర్సంపేట, ఘంటారావమ్ :**

ఢిల్లీలో విద్యార్థుల శాంతియుత ప్రదర్శనపై పోలీసుల దాడిని ఖండిస్తూ నర్సంపేటలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పిడిఎస్.యు, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పిడిఎస్.యు జిల్లా అధ్యక్షులు గుర్రం అజయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు దిడ్డి పార్థసారథి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పైసా గణేష్, బిఆర్ఎస్వి నర్సంపేట డివిజన్ కన్వీనర్ సదరం వినయ్ మాట్లాడుతూ.. జూలై 20న నీట్ ప్రశ్నా పత్రం లీకేజీ వలన 20 మందికి పైగా విద్యార్థులు మరణించారని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజినామా చేయాలని డిమాండ్ చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ పిలుపుతో గత 20 రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో నిరసన దీక్షలు చేపట్టిన సోనమ్ వాంగ్ చుక్ ను అక్రమంగా మద్యరాత్రి అరెస్టు చేశారని తెలిపారు. ఎలాంటి సౌకర్యాలు లేని ప్రభుత్వ హాస్పిటల్లో అరకొర వైద్యం చేస్తూ, విద్యార్థి లోకాన్ని రెచ్చగొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు హాస్యాస్పదంగా మారిందన్నారు. విద్యార్థులు చలో పార్లమెంటు పిలుపును ప్రశాంతంగా నిర్వహిస్తుంటే పోలీసులు, ప్రైవేటు గుండాలను పోలీసు బృందాల ద్వారా పంపి శాంతియుతంగా సాగుతున్న విద్యార్థుల ప్రదర్శనపై రాళ్ళు విసిరి లాటి చార్జీ, టియర్ గ్యాస్ ప్రయోగం, రబ్బరు బుల్లెట్లు వినియోగం, వాటర్ కాన్వాయ్ లను ఉపయోగించి చేసిన హింసాత్మక దాడుల్లో వందలాది మంది విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులు, ఉద్యమ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. అనేక మంది పై తప్పుడు కేసులు పెట్టి, అక్రమంగా అరెస్టు చేసిన తీరును తెలంగాణ రాష్ట్ర కమిటీలుగా తీవ్రంగా ఖండిస్తున్నదని పేర్కొన్నారు. అరెస్టు చేసి తప్పుడు కేసులు పెట్టిన విద్యార్థి నాయకులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రశాంత్, కిరణ్, వంశీ, రఘు, కిరణ్, ప్రమోద్, రవి, కిరణ్, సన్నీ, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జీ అప్రజాస్వామికం

**హనుమకొండ, ఘంటారావమ్ :**



న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన "చలో పార్లమెంట్" కార్యక్రమంలో విద్యార్థులు, యువజన సంఘాల నాయకులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జీ చేయడం, వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని నిరసిస్తూ హనుమకొండ అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ, విద్యార్థులు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిర్వహించిన "చలో పార్లమెంట్" కార్యక్రమంపై పోలీసులతో దాడి చేయించడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం, వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్ ప్రయోగించడం అత్యంత దారుణమని, ఈ ఘటనలో పలువురు విద్యార్థులు, యువకులు తీవ్రంగా గాయపడటం బాధాకరమని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పిడిఎస్యూ యునైటెడ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సారయ్య, వరంగల్ సామాజిక కార్యకర్త ఎం.ఏ. సమద్, సురేష్ నాయక్, రవి, మహేష్, కరీం పాల్గొన్నారు.



అమ్మవారికి కూరగాయలు తీసుకొని రావాలి.ఈ ర్యాలీలో ప్రతి ఒక్క హిందువు సాంప్రదాయ దుస్తులతోటి పాల్గొనాలి.ఈ ర్యాలీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు కూడా ఒక జాతీయ జెండాను తీసుకొని రావాలి.
వరంగల్ పోచమ్మ మైదాన్ హనుమాన్ టెంపుల్ నుండి భద్రకాళి దేవస్థానం వరకు భారీ ర్యాలీ కార్యక్రమం.

Edited, Printed, Published and Owned by Bollepelly Kishan, Printed at Sathyanarayana Printers, H.No 28-5-474/3, Reddypuram, Sai Krupa Colony, - 506001, Hanumakonda Dist. Telangana State.
Published at H.No. 10-3-488, OPP : RTC Workshop, Karimnagar- 505001, Karimnagar Dist. Telangana State. Editor : Bollepelly Kishan, RNI No : APTEL/2009/28812, Cell: 8978392904, Email: journalistkishan@gmail.com